క్లుప్తంగా

సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి

బడంగ్‌పేట్: గ్రామీణ విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అందించాలనే ఉద్దేశంతో పల్లవి మోడల్ స్కూల్ బోడుప్పల్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా డీజీ జ్ఞాన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనికి కంప్యూటర్‌లో దిగ్గజాలైన మానసరెడ్డి, నఫీసా అంజు హాజరయ్యారు. బోడుప్పల్ పరిసర ప్రాంతాలలోని 11 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ఎంపిక చేసుకుని అందులో 820 మంది విద్యార్థులకు కంప్యూటర్‌లో శిక్షణ కల్పించారు. పది రోజుల పాటు తర్ఫీదును అందించి ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నాదర్‌గుల్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులు మాట్లాడుతూ.. డీజీ జ్ఞాన తరగతులలో సైబర్ నేరాలు అరికట్టడం, ఎంఎస్ ఆఫీస్ ఉపయోగాలు తెలుసుకున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సమాచార ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, వీహబ్ సీఈఓ దీప్తి రావుల, కోఆర్డినేటర్ తాజ్, పల్లవి గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్ కొముదయ్య, డైరెక్టర్లు సుధ, సుశీల్, ప్రిన్సిపాల్ తనూజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో యువకుడు


పోలీసుల అదుపులో యువకుడు

కడ్తాల్: మండలంలోని మైసిగండి ఆలయ సమీపంలో మంగళవారం ఉదయం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గుర్తుతెలియని యువకుడు(26) పోలీసులకు కనిపించాడు. అతన్ని విచారించగా మూగ, చెవిటి వాడని తెలిసింది. మెదక్ జిల్లాకు చెందిన వాడని స్థానికులు చెప్పడంతో వెంటనే మెదక్ పోలీస్ కంట్రోలు రూంకు సమాచారం ఇచ్చారు. ఎవరికైనా యువకుడికి సంబంధించిన వివరాలు తెలిసి ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ శివప్రసాద్ కోరారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి


ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న కర్పూరి ఠాకూర్ సామాజిక సేవా సమితి సభ్యులు

వనస్థలిపురం: ఓటరు మేలుకో.. ఓటు విలువ తెలుసుకో అంటూ కర్పూరి ఠాకూర్ సామాజిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అశ్విని ఆంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, హస్తినాపురం డివిజన్లలో ప్రధాన కూడళ్లలో ప్లకార్డులతో అవగాహన కల్పించారు. ఆంజనేయులు మాట్లాడుతూ, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ప్రలోభాలకు లొంగకుండా మంచి అభ్యర్థులను ఎన్నుకోవాలని సూచించారు. సంస్థ సభ్యులు వంశీ, పవన్, కృష్ణ పాల్గొన్నారు.

ఓటుపై అవగాహన



పెద్దచెరువు వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మన్సూరాబాద్: ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ఐక్య ఉద్యమ వేదిక ఫౌండర్ మునగాల హరీశ్‌రెడ్డి మన్సూరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రధాన ఆయుధమని, యువత నిర్లక్ష్యపు ధోరణిని వీడి ఓటింగ్‌లో పాల్గొనాలని ఆయన ఫ్లెక్సీలో పేర్కొన్నారు.

అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి

హయత్‌నగర్: నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశానని, మరింత అభివృద్ధి చేసేందుకు మరోసారి అవకాశం ఇవ్వాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రజలను విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రచారంలో భాగంగా ఆయన తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని మన్నెగూడ, రాగన్నగూడ, ఇంజాపూర్, మునుగనూరు, తొర్రూరు, బ్రాహ్మణపల్లిల్లో పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని ప్రతి కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ఎన్నికల్లో మరోసారి గెలిపిస్తే ఆసరా పింఛన్లు ఐదువేలకు, రైతుబంధు పదహారు వేలకు పెంచుతామన్నారు. ప్రతి ఒక్కరికి 10 లక్షల బీమా చేస్తామని, రైతుకూలీలకు కూడా బీమా సౌకర్యం కల్పిస్తామని వివరించారు. మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి మరోసారి అవకాశం కల్పించాలని ఓటర్లను అభ్యర్థించారు. మల్లేశ్, లక్ష్మారెడ్డి, కొత్తకుర్మ సత్తయ్య, బల్‌దేవ్‌రెడ్డి, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.


మహేశ్వరం: ప్రచారంలో మాట్లాడుతున్న సబితారెడ్డి


మహేశ్వరం: ఉప్పుగడ్డ తండాలో సబితారెడ్డికి అండగా గిరిజన మహిళలు

రైతు వ్యతిరేక పార్టీలను ఓడిస్తాం

- రియల్ ఎస్టేట్ వ్యాపారులతో పోరు
- మహేశ్వరం బీఆర్ఎస్ అభ్యర్థి సబితారెడ్డి
- జోరుగా ప్రచార పర్వం

మహేశ్వరం: బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు బంధు కింద పట్టా పాసు బుక్ ఉన్న ప్రతి రైతుకు ఎకరానికి రూ.16 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని మహేశ్వరం బీఆర్ఎస్ అభ్యర్థి సబితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని డబిల్‌గూడ, మన్సాన్‌పల్లి, కొత్త తండా, ఉప్పుగడ్డ తండా, కావలోనిబాయి తండా, గంగారం తండా, గంగారం, సిరిగిరిపురం, హర్షగూడ గ్రామాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వరంలో ఇద్దరు రియల్ ఎస్టేట్ లీడర్లకు ఒక రియల్ లీడర్‌కు పోరు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి రైతు విరోధిగా వ్యవహరిస్తుందన్నారు. గతంలో నల్ల చట్టాలు తెచ్చి ఢిల్లీ శివారులో రైతులను నానా తిప్పలు పెట్టిన నాయకులు కూడా నేడు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. మహేశ్వరంలో మీ ఆడ బిడ్డగా ఆశీర్వదిస్తే, సేవ చేస్తానన్నారు. గత ఐదేళ్లు ఎక్కడా కన్పించని కాంగ్రెస్, బీజేపీ నేతలు నేడు ఓట్ల కోసం వస్తున్నారన్నారు. పట్లోళ్ల, తీగల కుటుంబాలు ఒక్కటయ్యాయని బీఆర్ఎస్‌కు తిరుగులేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ కష్టాలు వస్తాయన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే వంట గ్యాస్ సిలిండర్‌ను రూ.400లకే ఇస్తామన్నారు. ఆరునూరైన బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలుపు ఖాయమన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధిక స్థానాలు గెలుపొంది మూడోసారి అధికారంలోకి రాబోతుందన్నారు. అంతకు ముందు మన్సాన్‌పల్లిలో మహిళలు బతుకమ్మలు, హారతితో మంత్రికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు నర్సింహ, బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, అంజయ్యముదిరాజ్, ఎంపీపీ సునీతా నాయక్, మండల అధ్యక్షుడు రాజు నాయక్, రాఘవేందర్‌రెడ్డి సర్పంచులు అరుణ, నేజీరెడ్యా నాయక్, సాలీవీరా నాయక్ ఎంపీటీసీ స్వప్న సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు థామస్‌రెడ్డి నాయకులు పాండు, వెంకటేశ్వర్‌రెడ్డి, సీతారామ్ నాయక్, ఈశ్వర్ నాయక్, శ్రీనివాస్, జాన్‌రెడ్డి, నర్సింహాయాదవ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


మహేశ్వరం: సబితారెడ్డికి మద్దతు తెలుపుతున్న మైనార్టీ సోదరులు

అభివృద్ధి చేసిన సబితమ్మకే ఓటు

కందుకూరు: వందల కోట్లు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన మంత్రి సబితారెడ్డికే ఓటు వేసి గెలిపించాలని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని ధన్నారంలో స్థానిక సర్పంచ్ శ్రీదేవిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి సబితారెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల కోసం అహర్నిశలు కష్టపడి పని చేస్తున్న సబితమ్మ విజయానికి అందరం కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌ముదిరాజ్, కరుణాకర్, మల్లేష్, సంజీవరెడ్డి, జైపాల్, బాల్‌రాజ్, రమేష్, నర్సింహ, నాగేష్, రమేష్, యాదయ్య, పర్వతాలు, సోమలింగం, రాజ్‌కుమార్, రాజప్ప పాల్గొన్నారు. కందుకూరులో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్, మోహన్‌రెడ్డి, ప్రశాంత్‌చారి, రాములు, దర్శన్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రచార హోరు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సబితారెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని కోరారు. మహేశ్వరంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సబితమ్మను గెలిపించండి

హుడాకాంప్లెక్స్: మహేశ్వరం బీఆర్ఎస్ అభ్యర్థి సబితారెడ్డిని గెలిపించాలని సరూర్‌నగర్‌లో మంగళవారం డివిజన్ అధ్యక్షుడు మహేందర్ యాదవ్, మాజీ అధ్యక్షుడు అంకిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలకిషన్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన పథకాలు, మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కొండల్‌రెడ్డి, అశోక్, సుధామా తదితరులు పాల్గొన్నారు.


హుడాకాంప్లెక్స్: సమావేశంలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

బీఆర్ఎస్ గెలుపును ఎవరూ అడ్డుకోలేరు

హుడాకాంప్లెక్స్: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే బీఆర్ఎస్ అభ్యర్థి సబితారెడ్డి గెలుపును ఎవరూ అడ్డుకోలేదని యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సరూర్‌నగర్ డివిజన్‌లోని 70 పోలింగ్ బూత్‌ల కన్వీనర్లు, నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సహకారంతో మంత్రి సబితారెడ్డి నియోజకవర్గంలో ఎన్నో ఐటీ కంపెనీలను తీసుకు వచ్చిందన్నారు. ప్రజల మంచి కోరే సబితమ్మను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు బాలకిషన్, మహేందర్‌యాదవ్, దయాకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, అంకిరెడ్డి, అశోక్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే మైనార్టీల సంక్షేమం

మహేశ్వరం: మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పెండ్యాల గ్రామానికి చెందిన మైనార్టీ నాయకులు, మహిళలు మంత్రి సబితారెడ్డిని కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మైనార్టీల అభివృద్ధికి తన వంతు కృషి చేశానన్నారు. నియోజకవర్గంలో మైనార్టీ భవనానికి స్థలం కేటాయించి, నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాలు అందించి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్యారాజేష్ నాయకులు వజ్రంరెడ్డి, అశోక్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, సంజీవరెడ్డి, పెంటారెడ్డి, ఎండీ.షరీఫ్, ఆసరా, జీలానీ, రబ్బానీ పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశ భవిష్యత్తు

- పార్టీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్

కందుకూరు: మహేశ్వరంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి అందెల శ్రీరాములుయాదవ్ ధీమా వ్యక్తం చేశారు. మండల పరిధిలోని తిమ్మాపూర్, జైత్వారం, దెబ్బడగూడ గ్రామాలకు చెందిన పలువురు నాయకులు నియోజకవర్గం కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ.. బీజేపీతోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని, ప్రజలు తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, రమేష్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

వలస నేతలను ఓడించాలి

మహేశ్వరం: బీజేపీ మహేశ్వరం అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ గెలుపు ఖాయమని ఆ పార్టీ జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఆకన్‌పల్లి, ఘట్టుపల్లి గ్రామాలకు చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న సబితారెడ్డి, కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిలు వలస నేతలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్రజావ్యతిరేక విధానాలే తమని గెలిపిస్తాయన్నారు. బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్శితులై ఇతర పార్టీల నుంచి నాయకులు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాధవచారి, నాయకులు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.


పాపయ్య గౌడ్ సమక్షంలో బీజేపీలో చేరిన యువకులు



అందెల సమక్షంలో బీజేపీలో చేరిన నాయకులు

పోలింగ్ నిర్వహణ తీరుతెన్నుల పరిశీలన

కలెక్టరేట్‌లో మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ

ఇబ్రహీంపట్నం రూరల్: పోలింగ్ నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలన చేయాలని మైక్రో అబ్జర్వర్లకు జనరల్ అబ్జర్వర్లు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి , జనరల్ అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్లతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణకు హాజరైన జనరల్ అబ్జర్వర్లు ఆర్ఎస్ వినమ, శిల్పగుప్తా, చంద్రకాంత్ కృష్ణారావు డాంగే, రామ్‌కుమార్, తైతులంగ్ పమేయలు మాట్లాడుతూ.. జిల్లాలో జరుగుతున్న ఎనిమిది నియోజకవర్గాలకు శాసనసభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కల్గి ఉండాలన్నారు. పోలింగ్‌కు ముందు రోజు ఉ.7 గంటలకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకొని సిబ్బందికి సామగ్రి అందిందా లేదా చూసుకోవాలని చెప్పారు. సిబ్బందితో పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు ఉన్నాయా లేవా చూసుకోవాలని తెలిపారు. పోలింగ్ విధుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. పోలింగ్ పూర్తయ్యే వరకు ప్రతి అంశాన్ని గమనించాలని ఆదేశించారు. ప్రతి పార్టీ తరఫున ఇద్దరు ఏజెంట్లను నియమించనుండగా పోలింగ్ కేంద్రాల్లోకి ఒక్కరికి మాత్రమే అనుమతించాలన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల సంఘం గుర్తింపు కార్డులు కలిగిన వారు మినహా ఇతరులను లోపలికి అనుమతించరాదన్నారు. ఏ సమస్య ఉన్న వెంటనే సంప్రదించాలన్నారు. బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ఈ శిక్షణలో మాస్టర్ ట్రైనర్లు, మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.


మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఇస్తున్న జనరల్ అబ్జర్వర్లు

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు అందజేస్తున్న తెహ్మినా ఖాన్, ఉపాధ్యాయులు

మాడ్గుల: చదువుతో పాటు విద్యార్థులు క్రీడలపై దృష్టి సారిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని అమెరికా తెలుగు అసోసియేషన్ సభ్యులు తెహ్మినాఖాన్ అన్నారు. మండలంలోని ఇర్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేవ్ ఎన్విరాన్మెంట్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెహ్మినాఖాన్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. క్రీడలతో శారీరకదారుఢ్యం, మానసికోల్లాసం కలుగుతోందని అన్నారు. అలాగే, భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంలో ఉపయోగపడుతాయని తెలిపారు. ఎంఈఓ సర్దార్ నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్వతాలు, మాజీ హెచ్ఎం విజయ భాస్కర్‌రెడ్డి ఉపాధ్యాయులు ముత్యపురెడ్డి, పీఈటీ వేంకటేశ్వర్లు రాజు పాల్గొన్నారు.

మెట్రోరైల్ ప్రాజెక్టను ప్రారంభించింది కాంగ్రెస్సే


ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్‌లో ప్రయాణికులతో ముచ్చటిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీగౌడ్

- పార్టీ ఎల్బీనగర్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్
- మెట్రోలో ప్రయాణిస్తూ వినూత్న ప్రచారం

వనస్థలిపురం: నగరవాసులకు ట్రాఫిక్ కష్టాలు తగ్గించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం 2008లో మెట్రో ప్రాజెక్టను ప్రారంభించిందని ఆ పార్టీ ఎల్‌బీనగర్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన ఎల్‌బీనగర్ నుంచి మెట్రో రైలులో ప్రయాణించి వినూత్న రీతిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐటీ ప్రొఫెషనల్స్, ఇతర ఉద్యోగులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ విజనరీ పార్టీ అని, ఏ ప్రాజెక్ట్ రూపొందించినా భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఉంటుందని అన్నారు. బీఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ రెండేళ్లకే ప్రమాద దశకు చేరుకుందని, జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో కాంగ్రెస్ కట్టిన నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ ఇప్పటికీ చెక్కు చెదరలేదని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం విచ్చల విడిగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ కమీషన్లు దండుకుంటోందని ఆరోపించారు. మీ పిల్లల భవిష్యత్ కోసం కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని కోరారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తుందన్నారు.

1969 తెలంగాణ ఉద్యమకారుల మద్దతు...

తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ కాంగ్రెస్ పార్టీని నమ్ముతున్నామని, ఎల్‌బీనగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతు తెలుపుతున్నామని 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు అయినప్పటికీ తమ డిమాండ్లపై బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, తమను కలవడానికి కూడా ముఖ్యమంత్రి అపాయింట్మెంట్ ఇవ్వలేదని వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చక్రహరి రామరాజు, ఉపాధ్యక్షుడు వనం చంద్రమౌళి, మారం సంతోష్‌రెడ్డి, వెంకటయ్య, చంద్రారెడ్డి, భాస్కరశర్మ, బాలయ్య, గణేష్, యుగంధర్ పాల్గొన్నారు.

మేనిఫెస్టోను వందశాతం అమలు చేస్తాం...

హయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన మాటను తప్పకుండా నిలబెట్టుకుంటుందని ఆ పార్టీ మేనిఫెస్టో కమిటీ నాయకులు అన్నారు. మంగళవారం వనస్థలిపురంలో కమిటీ సభ్యులు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, ప్రొ. జానయ్య, అల్లం భాస్కర్, స్పోక్స్ పర్సన్ వెదిరె యోగేశ్వర్‌రెడ్డి, పోరెడ్డి నాగమణిరెడ్డి కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల చేసి, అందులోని అంశాలను వివరించారు.

ప్రజలను దోచుకుంటున్న బీఆర్ఎస్


కందుకూరు చౌరస్తాలో మాట్లాడుతున్న కేఎల్లార్


కందుకూరు: కటికపల్లిలో కేఎల్లార్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

- కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి
- కందుకూరులో ఎన్నికల ప్రచారం

కందుకూరు: దోచుకునే బీఆర్ఎస్ కావాలో, సేవ చేసే కాంగ్రెస్ కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని 14 గ్రామాల్లో జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో గెలిచి మంత్రి పదవి కోసం సబితారెడ్డి పార్టీ మారి కార్యకర్తలను మోసం చేశారన్నారు. నియోజకవర్గంలో భూకబ్జాలు పెరిగిపోయాయని, గూండాయిజం, స్నేక్ గ్యాంగ్ అరాచకం, మర్డర్లు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రాంతంలో గ్రీన్ జోన్, బఫర్ జోన్ పెట్టించి, చేవెళ్లలో జీఓ 111ను ఎత్తి వేయించారన్నారు. లీడ్ ఇండియా, కేఎల్లార్ ట్రస్ట్ పెట్టి 30 ఏళ్లుగా తాను సేవ చేస్తున్నానని, ఎంతో మందికి ఉద్యోగాలు ఇప్పించానన్నారు. ఫార్మాసిటీ పేరుతో అసైన్డ్ భూములను గుంజుకున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని రైతులకు పట్టా సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. దళితులకు మూడు ఎకరాలు ఇస్తామని మోసం చేశారన్నారు. ఎస్టీలకు పది శాతం, మైనార్టీలకు 12 శాతం ఇస్తానన్న రిజర్వేషన్లు ఏమైయ్యాయని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్లు తప్పా ఈ ప్రాంత వాసులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఎక్కడ ఇచ్చారో చెప్పాలన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని, ప్రతి ఇంటికి ఆ గ్యారంటీ కార్డులను పంపిణీ చేస్తున్నామన్నారు. వైఎస్ఆర్ పాలన తిరిగి రావాలంటే కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేలా ఓట్లు వేసి దొరల పాలనకు చరమగీతం పాడాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శమంతారెడ్డి, నాయకులు మల్లేష్, సత్యనారాయణ, పాండు, మదన్‌పాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రాకేష్‌గౌడ్, వీరారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వీరన్న, వెంకటరెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

హస్తంతోనే పేదలకు మేలు

దిల్‌సుఖ్‌నగర్: పేదల కష్టాలు తీరాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావాలని మహేశ్వరం నియోజకవర్గం ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎల్లార్ సతీమణి విజయలక్ష్మి, ఆర్కేపురం డివిజన్ పార్టీ మహిళ మాజీ అధ్యక్షురాలు తమలపాకుల హర్షలత పేర్కొన్నారు. మంగళవారం ఆర్కేపురం డివిజన్‌లోని చిత్రలేఅవుట్‌కాలనీ, ఎన్టీఆర్‌నగర్‌లో లక్ష్మారెడ్డికి మద్దతుగా ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హర్షలత మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు చమరగీతం పాడాలని కోరారు. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుతున్నారని, కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో సుచరిత చౌదరి, పద్మారెడ్డి, సుగుణరెడ్డి, రామకృష్ణారెడ్డి, అంజిరెడ్డి, మల్లికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దిల్‌సుఖ్‌నగర్: ప్రచారం నిర్వహిస్తున్న కేఎల్లార్ సతీమణి విజయలక్ష్మి, హర్షలత

అన్ని వర్గాలకు భరోసా

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని మహేశ్వరం నియోజకవర్గం ఆ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. రామకృష్ణపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లోని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి సురేందర్ రెడ్డి, చంద్రమౌళి, దాస్, మున్నా, ఖలీల్, ఫిరోజ్ తదితరులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. దేప భాస్కర్‌రెడ్డి, రామకృష్ణపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, చిలుక ఉపేందర్ రెడ్డిలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితేనే పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జ్ఞానేశ్వర్‌యాదవ్, శివ, శేఖర్‌ముదిరాజ్, అక్బర్, కల్యాణ్‌యాదవ్, నాభి, ఇస్మాయిల్, అల్లేటి కిరణ్, పింటు తదితరులు పాల్గొన్నారు.


పహాడీషరీఫ్: రోడ్డు షోలో కేఎల్లార్

కాంగ్రెస్‌లో చేరిన ఎంఐఎం కౌన్సిలర్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ జింకల రాధిక మజ్లిస్ పార్టీని వీడి మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మహేశ్వరం నియోజకవర్గం అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో ఆమె పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు నచ్చి ఆ పార్టీలో చేరుతున్నానన్నారు. మున్సిపాలిటీలోని అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు.

పేదలపై భారం

పహాడీషరీఫ్: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రంగ నాయకుల కాలనీ, మామిడిపల్లి గ్రామాలలో మంగళవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం అభ్యర్థి కేఎల్లార్, బడంగ్‌పేట్ మేయర్ పారిజాతనర్సింహా రెడ్డితో కలిసి రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ఆయనకు మంగళ హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. మంత్రి సబితారెడ్డి ఈ ప్రాంతాన్ని ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. బీజేపీ వస్తే పేదలపై మరింత భారం మోపుతారన్నారు. నాయకులు నర్సింహా రెడ్డి, సతీష్ గౌడ్, జంగయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

నేడు మహేశ్వరంలో ప్రచారం

మహేశ్వరం: మండలంలో బుధవారం జెండామర్రి తండా తండా, హర్షగూడ, సిరిగిరిపురం, గంగారం ,మైలార్‌బాయి తండా, మొహబ్బత్‌నగర్, తుమ్మలూరు, కేసీ తండా, మహేశ్వరం గ్రామాల్లో కేఎల్లార్ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారని మండల అధ్యక్షుడు ఈశ్వర్ ముదిరాజ్ పేర్కొన్నారు.